నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమం నేడు యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ సోమవారం ఉదయం 9.30 గంటలకు ఆయా మండలాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

పర్యాటకం గాడిన పడేనా..?

- ప్రకృతి అందాలకు నెలవుగా జిల్లా
- కార్తీక మాసంలో పెరగనున్న సందర్శకులు
- తెరుచుకోని కాకినాడ ఎన్‌టిఆర్ బీచ్ పార్క్
- పర్యాటక ప్రాంతాల్లో సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సుదీర్ఘ తీర ప్రాంతం, పచ్చని తూర్పు కనుమలు, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన ఆలయాలు, ప్రముఖ దర్శనీయ ప్రదేశాలు, చారిత్రక ప్రాంతాలు కాకినాడ జిల్లాలో ఉన్నాయి. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో పెద్ద ఎత్తున సందర్శకులు పర్యాటక ప్రదేశాలకు తరలి వస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇదే అదునుగా ఎన్నికలకు ముందు కూటమి నేతలు అనేక విమర్శలు గుప్పించారు. పర్యాటక అభివృద్ధి మరిచిన వైసిపిని గద్దె దించాలని, చంద్రబాబు ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఆ పార్టీల ప్రతినిధులు చెప్పుకొచ్చారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కందుల దుర్గేష్ పర్యటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్నప్పటి నుంచి పర్యటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి ఏటా లక్షలాది మంది సందర్శకులు, పర్యాటకులు జిల్లాకు వస్తున్నారు. టూరిజం శాఖ కాకినాడ డివిజన్ పరిధిలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలున్నాయి. ప్రతీ ఏటా కోటి నుంచి 20 లక్షల మంది పర్యాటకులు ఇక్కడకు వస్తున్నారని అంచనా. నవంబర్ నుంచి జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకూ అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో చూసుకుంటే కాకినాడ రూరల్ వాకలపూడి బీచ్ పార్క్, కోరంగి మడ అడవులు, కాకినాడ, ఎస్.యానాం, ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాలు ఇలా అనేక పర్యాటక ప్రదేశాలున్నాయి. జిల్లాకు పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. అలాగే అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం, సామర్లకోట భీమేశ్వరస్వామి టెంపుల్, పిఠాపురం పాదగయ దేవస్థానం(దక్షిణ కాశీ) టెంపుల్ టూరిజం జిల్లాలో బాగా అభివృద్ధి చెందింది.

కానరాని పర్యాటకాభివృద్ధి

కాకినాడ జిల్లా కేంద్రంకు అతి సమీపంలో కుంభాభిషేకం ఆలయం, కాకినాడ పోర్టు, ఫిషింగ్ హార్బర్, వాకలపూడి లైట్ హౌస్, ఎన్‌టిఆర్ బీచ్, సముద్రానికి ఆనుకుని ఏర్పాటుచేసిన ప్రత్యేక గుహలు, పక్కనే శిల్పారామం వంటి పర్యాటక ప్రాంతాలు ఇక్కడ కనువిందు చేస్తాయి. జగన్నాథపురంలో ఫ్రెంచ్, డచ్, బ్రిటిష్ వారు నిర్మించిన చర్చిలు ఇక్కడ ప్రత్యేకతలుగా ఉన్నాయి. అలాగే 17 కిలోమీటర్ల పొడవు, రెండున్నర కిలోమీటర్ల వెడల్పుతో కాకినాడ తీరానికి 12 కిలోమీటర్ల దూరంలో హోప్ ఐలాండ్ ఉంది. అలాగే కాకినాడకు సమీపంలో కోరంగి మడ అడవులకు ఎంతో ప్రత్యేకత ఉంది. దేశ, విదేశాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. ఈ ప్రాంతంలో నది జలాలు సముద్రంలో కలుస్తాయి. అనేకమంది పర్యాటకులు బోట్లపై ప్రయాణించి ప్రకృతి అందాలను తిలకిస్తారు. అయితే ఈ ప్రాంతాల అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదనే వాదనలు పర్యాటకుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే అభివృద్ధి జాడ కనిపించకపోవడంతో పర్యాటకులు పెదవి విరుస్తున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో అరకొర సందర్శనకే పరిమితం అవుతున్నారు. గత ప్రభుత్వం పర్యాటక రంగాన్ని పూర్తిగా విస్మరించగా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. అయితే పర్యాటక అభివృద్ధిపై నేటికీ సరైన దృష్టి సారించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. గత టిడిపి ప్రభుత్వం పాలనలో ఎన్‌టిఆర్ బీచ్‌ను రూ. లక్షల నిధులతో ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఈ బీచ్ పార్కు పర్యాటకులకు కనువిందు చేసేది. మ్యూజికల్ ఫౌంటెన్, అద్దాల వంతెన, లేజర్ షోలు పర్యాటకులను ఆకట్టుకునేవి. దేశంలోనే మొట్టమొదటి గ్లాస్ వంతెన ప్రత్యేకమైనది. సాల్ట్ వాటర్‌లో ఏర్పాటు చేసిన లేజర్ షో మన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతాయి. కానీ అవన్నీ నాలుగేళ్లుగా మూతపడ్డాయి. వేలల్లో పర్యాటకులు ఇక్కడికి వచ్చి సేద తీరేవారు. ఇటీవల మంత్రి కందుల దుర్గేష్ ఈ ప్రాంతాన్ని పరిశీలించి తిరిగి పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే సంక్రాంతిలో సంబరాలు నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. అయితే వాటికి సంబంధించిన పనులు నేటికీ ప్రారంభం కాలేదు. నాలుగేళ్ళ క్రితం సుమారు రూ. 6 కోట్లు కూడా ప్రత్యేక నిధులతో కాకినాడ బీచ్ లో భారీ యుద్ధ విమానాన్ని పర్యాటకుల సందర్శన కోసం ఏర్పాటు చేశారు. కానీ నేటికీ ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుతం ఈ ఎయిర్ క్రాఫ్ట్ నిరుపయోగంగా, కళావిహీనంగా దర్శనమిస్తుంది.

ఆదాయానికి గండి

జిల్లాలో పలు పర్యాటక ప్రదేశాల్లో సందర్శకులకు కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. దాంతో సందర్శకుల తాకిడి తగ్గుతున్న కారణంగా భారీగా ఆదాయానికి గండి పడుతుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాకినాడ రూరల్లో ఉన్న ఎన్‌టిఆర్ బీచ్ ద్వారా సుమారు రూ.18 లక్షలు, కోరంగి రిసార్ట్స్ నుంచి రూ.9 లక్షలు ఆదాయం ప్రతి నెలా సమకూరేది. ఇప్పుడు మూతబడడంతో ప్రస్తుతం ఒక రూపాయి కూడా ఆదాయం లేదని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు తక్షణమే స్పందించి పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

17వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

మూడు నెలల బకాయి వేతనాలతో పాటు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన ఆందోళన ఆదివారం నాటికి 17వ రోజుకు చేరింది. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో క్లాప్ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు కొప్పుశెట్టి సత్తిబాబు మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు సత్తిబాబు, 104 సంఘం జిల్లా నాయకులు త్రిమూర్తులు, మధ్యాహ్న భోజనం పథకం యూనియన్ నాయకులు ఎన్ ఈశ్వరి మాట్లాడారు. 17 రోజుల నుంచి క్లాప్ వాహన డ్రైవర్లు ఆందోళన చేపడుతున్నా అధికారుల్లో చలనం లేదన్నారు. మంత్రులు, ఎంఎల్ఎలు లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వేతనాలు తీసుకుంటున్నప్పుడు కార్మికులకు ఇచ్చే అతి తక్కువ వేతనాన్ని కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పాలనాపగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తియైన సందర్భగా వేడుకలు నిర్వహిస్తున్న ప్రభుత్వం మూడు నెలలుగా జీతాలు లేకుండా రోడ్డున పడ్డా కార్మికుల కోసం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన న్యాయమైన పోరాటానికి ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, అవసరమైతే ప్రత్యక్ష పోరాటానికి కూడా దిగడానికి సిద్ధపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, గంగాధర్, రాజు, కొండబాబు, భద్ర, దురా ప్రసాద్, జేవీ రమణ, అరుణ్ కుమార్, విద్యాసాగర్, ఎస్ రాజు, కె శ్రీను, టి సతీష్, ఎస్ మహేష్, ఎల్ శివ కుమార్, ఆనంద్, రమణ పాల్గొన్నారు.

బోట్ క్లబ్ పార్కును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

నిర్వాహణ లేక వెలవెలబోతున్న పార్కు

కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన బోట్ క్లబ్ పార్కును అభివృద్ధి చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం పార్కును పరిశీలించారు. పార్కులో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా అక్కడే తగలబెట్టడం సరి కాదన్నారు. నీటి దుర్వినియోగం ఎక్కువగా ఉందన్నారు. చెరువు పొడవునా రైలింగ్‌ను ఆనుకుని ఉన్న మార్గం అంతా తుప్పలతో నిండి ఉందన్నారు. కరెంటు, కేబుల్ వైర్లు, ఫీజు బాక్సులు ఓపెన్‌గా ఉండడం వలన ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వెలుతురు కల్పించే విద్యుత్ దీపాలు కరువయ్యాయన్నారు. తక్షణమే పార్కు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ మేరకు గుర్తించిన సమస్యలపై కమిషనర్‌కు లేఖను రాస్తున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో చింతపల్లి అజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, పులి సతీష్, వెలగా భాస్కర్ పాల్గొన్నారు.

మోడీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాటం

ప్రజాశక్తి - కాకినాడ

మీడియాతో మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవలంబిస్తున్న నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయడం అవసరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక గాంధీభవన్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే పేరుతో జమిలీ ఎన్నికలను తీసుకొస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ త్రిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. జమిలీ ఎన్నికలు రాజ్యాంగ వ్యతిరేక చర్య అని అభిప్రాయపడ్డారు. రోజురోజుకు నిత్యాసర వస్తువుల ధరలను కేంద్రప్రభుత్వం పెంచుకుంటూ పోతున్నదని, పెట్రోల్ డీజిల్ ధరలపై నియంత్రణ లేకుండా పోయిందన్నారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని విమర్శంచారు. దేశాన్ని కాపాడుకోవాలంటే నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన కోరారు. ఉచిత ఇసుక విధానంపై చంద్రబాబు దృష్టి కేంద్రీకరించాలని, క్షేత్రస్థాయిలో ఇసుక మాఫియా పెట్రేగిపోతుందని అన్నారు. నిర్మాణ రంగానికి ఇసుక నేటికీ అందుబాటులోకి రాలేదని, దీనిపై పూర్తిస్థాయిలో పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటి స్థలాలపై ఈనెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల ముందు పేద ప్రజలందరూ అర్జీలు ఇవ్వాలని, దానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె.బాడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొన్నారు.

104 ఉద్యోగుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

104 ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగులు నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, 104 సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, త్రిమూర్తులు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కె.వెంకటరావు మాట్లాడారు. 104 అంబులెన్సుల నిర్వహణ పేరుతో ఇప్పటివరకు అరబిందో సంస్థకు ఒక్కొక్క వాహనానికి రూ.1.20 లక్షలు చెల్లించారని, అసలు ఖర్చు వాహనానికి రూ.60 వేలు మాత్రమేనని అన్నారు. మిగిలింది రాజకీయ నాయకుల, ఉన్నతాధికారులకు, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్తుందని ఆరోపించారు. అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 104 నిర్వహణ భారంగా మారకుండా ప్రభుత్వమే నేరుగా నిర్వహించి ప్రజాధనాన్ని సద్వినియోగం చేయాలని డిమాండ్ చేశారు. మధ్యవర్తులు ప్రవేశించడం ద్వారా గత ఐదేళ్లలో ఒక్కనెల కూడా వేతనాలు సరిగా అందలేదని, యాజమాన్యం చెల్లించాల్సిన పిఎఫ్ సొమ్ము సైతం ఉద్యోగుల జీతాలు నుంచే మినహాయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం చెల్లించాల్సిన 10 శాతం ఇంక్రిమెంట్ కూడా చెల్లించకుండా ఉద్యోగుల కష్టాలకు అరబిందో యాజమాన్యం కారణమైందని విమర్శించారు. 2009 నుంచి 2016 వరకూ ప్రభుత్వమే 104 నిర్వహించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కూడా జగన్ ప్రభుత్వం విడిచిన చొప్పుల్లోనే పాలన చేసేందుకు ప్రయత్నిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆనంతరం ఉద్యోగులు జిల్లా పరిషత్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి నిరసన దీక్షను ముగించారు. ఈ నిరసన దీక్షకు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల శ్రీనివాస్, నాయకులు రాధాకృష్ణ, మున్సిపల్ క్లాప్ డ్రైవర్స్ సంఘం నాయకులు గంగాధర్, ఈశ్వర్, అర్బన్ హెల్త్ ఉద్యోగుల సంఘం నాయకులు కెపి.నాయుడు శిబిరాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షురాలు ఇందుమతి, డివిజన్ నాయకులు హరిప్రసాద్, శివ శంకరరావు, తేజా, సతీష్, మహేశ్వరి, కోశాధికారి సిహెచ్ శ్రీను,104 ఉద్యోగులు పాల్గొన్నారు

కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో నినదిస్తున్న 104 ఉద్యోగులు

ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారందరూ తమ బ్యాంకు ఖాతాకు ఆధార్, మొబైల్ నెంబర్లను అనుసంధానం చేసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎన్‌పిసిఐ మ్యాపింగ్ ద్వారా ప్రభుత్వ పథకాల అర్హులకు ఆర్థిక సాయం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా 20,96,877 మంది పౌరులు ఉండగా అందులో 18 సంవత్సరాలు పైబడిన వాళ్లు 17,11,043 మంది ఉన్నారని, అందులో 14,36,555 మంది నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పిసిఐ)లో తమ బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్‌తో అనుసంధానం చేసుకున్నారని అన్నారు. 2,74,488 మంది ఇంకా తమ బ్యాంక్ ఖాతాలకు ఆధార్, మొబైల్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని ఆయన తెలిపారు. వీరందరూ ఎన్‌పిసిఐ మ్యాపింగ్ చేసుకోవాలని ఆయన కోరారు. అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలో ఎన్‌పిసిఐ మ్యాపింగ్ ఒక డ్రైవ్ తరహాలో చేస్తున్నారని, ప్రభుత్వ పథకాల ద్వారా సొమ్ములు అందుకుంటున్న లబ్దిదారుల్లో ఎవరికైతే బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేదో వారికి ఆధార్ అనుసంధానం చేయిస్తున్నారన్నారు. దీని ద్వారా ఎన్‌పిసిఐ మ్యాపింగ్ చేస్తున్నారన్నారు. ప్రధానంగా బ్యాంకుల్లో, ప్రధాన పోస్టాఫీసుల్లో సేవింగ్ ఎకౌంట్ ఖాతాలతో ఆధార్ అనుసంధానం జరుగుతుందన్నారు. పోస్టాఫీసుల్లో ఐపిపిబి సేవింగ్స్ ఖాతాలను కొత్తగా తెరిపించి ఆధార్ అనుసంధానం చేస్తున్నారన్నారు. తద్వారా ఎన్‌పిసిఐ మ్యాపింగ్ జరుగుతుందన్నారు. అన్ని మండలాల్లో ఈ ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆధార్ అనుసంధానానికి లబ్దిదారులకు దిశానిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. ఇది కేవలం బ్యాంకు ఖాతాల నిమిత్తమే ఈ మ్యాపింగ్ జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - కరప



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న జర్నలిస్టులు

కరప ప్రెస్ ఫోరం నూతన కార్యవర్గ ఏర్పాటు చేసినట్లు నూతన అధ్యక్షులు తుమ్మలపల్లి సత్తిబాబు తెలిపారు. గౌర అధ్యక్షులు సిహెచ్. సత్యనారాయణ, డిహెచ్‌వి.సాంబశివరావు, గునుపే శోభన్ బాబు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా తుమ్మలపల్లి సత్తిబాబు, కార్యదర్శిగా సాదే వీర రాఘవులు, కోశాధికారిగా బుద్దాల రాంప్రసాద్‌లను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా నక్క శ్రీనుబాబు, మేడిశెట్టి బాబి, బాబులు, వల్లిబాబు, దొరబాబు, మెండు గోవిందు, అడబాల శ్రీనివాసరావు, గుబ్బల ప్రసాదరావు, ప్రకాష్, బుద్దాల చక్రరావు, చంద్ర నగేష్ ఎంపికయ్యారు.

ప్రజా పోరును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజా పోరు గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యలపై జరుగుతున్న ప్రజా పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం తాళ్లరేవులో ప్రజాపోరు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిత్యవసర సరుకుల ధరలను తగ్గించడంలో విఫలమవ్వడమే కాకుండా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారాలు వేస్తుందన్నారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారానికి వచ్చిన కూటిమి ప్రభుత్వం విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలను ప్రజలపై వేయడానికి సిద్ధమయిందన్నారు. ఉచిత ఇసుకను అమలు చేయడంలో లోపాలున్నాయని తెలిపారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను హత్యలను నియంత్రించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం కాకుండా ఆపాలనీ తదితర డిమాండ్లతో వారం రోజులు పాటు ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ కన్వీనర్ టి.ఈశ్వరరావు, వి.రాజబాబు, డి.అదృష్టదీపుడు, సిహెచ్.వెంకటలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రైతు పోరాట కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - తొండంగి

నినాదాలు చేస్తున్న బాధిత రైతులు

మండలంలోని బెండపూడిలో పచ్చని పొలాల మధ్య విమానాశ్రయం నిర్మాణానికి వ్యతిరేకంగా రైతు పోరాట కమిటీ ఏర్పాటు అయింది. ఆదివారం బెండపూడి హైస్కూల్ వద్ద బెండపూడి, చిన్నయ్యపాలెం, అన్న వరంకి చెందిన రైతులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో చేపట్టే పోరాటానికి రైతు పోరాట కమిటీని ఎంపిక చేసుకున్నారు. పోరాట కమిటీకి గౌరవ అధ్యక్షులుగా వెంకట బుచ్చయ్య చౌదరిని ఎన్నుకున్నారు. ముందుగా రైతులందరూ తమ పొలాల వద్ద పచ్చని పొలాల ముద్దు విమానాశ్రయం వద్దు అంటూ నినాదాలు చేశారు. గత రెండు వారాలుగా విమానాశ్రయం వద్దంటూ అధిక సంఖ్యలో బాధితు రైతులు టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎ యనమల దివ్య, కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. అయినా విమానాశ్రయంకు సంబంధించి భూముల సర్వే రిపోర్టును కలెక్టర్ విమానయ శాఖకు పంపినట్లు వచ్చిన వార్తలపై బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చిన కలెక్టర్ విమానాశ్రయానికి సంబంధించి భూముల సర్వే నివేదికను పంపించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మరోసారి టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడిని కలిసి తమ గోడును వినిపించాలని ఈ సమావేశంలో రైతులు తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

తలసేమియా చిన్నారులకు అండగా నిలుద్దాం

ప్రజాశక్తి - కాకినాడ

తలసేమియా చిన్నారులకు రక్తాన్ని అందించి అండగా నిలుద్దామని చేయూత సంస్థ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్, కార్యదర్శి అలీమ్ పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎ.సత్యనారాయణ, రెడ్ క్రాస్ ఛైర్మన్ వైడి.రామారావు, పూర్వపు కాకినాడ డివిజన్ డివైఇఒ కెవివి.సత్యనారాయణ, ఎంఇఒలు కెబి.కృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, చెవ్వూరి రవి, పైడిరాజు, వేణుగోపాల్, సివివి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆపద సమయంలో సమయానికి రక్తం అందక ఎంతో మంది క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని అన్నారు. రక్తం అందక ఇబ్బంది పడకుండా ఉండాలంటే యువత అందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తలసేమియా వ్యాధిగ్రస్తులు 153 మంది వరకూ ఉన్నారని, వారికి ప్రతి 21 రోజులుకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉందన్నారు. రెడ్ క్రాస్ సంస్థ ప్రతి మంగళ, శుక్ర వారాలలో ఉచితంగా రక్తం ఇవ్వడమే కాకుండా ఎక్కించడం కూడా జరుగుతుందని తెలిపారు. రెడ్ క్రాస్ చేస్తున్న ఈ బృహత్తర కార్యక్రమానికి తోడ్పాటుగా చేయూత సంస్థ బాలల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ మహిళలు స్వాతి, పోసమ్మ, గోపి, సత్యన్నారాయణ రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. అలాగే ఉపాధ్యాయులు, యువకులు రక్తదానం చేశారు. చేయూత ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణ మూర్తి మాట్లాడుతూ చిన్నారి అనూష గుండె ఆపరేషన్ కోసం సేకరించిన లక్ష రూపాయలు విజయవాడ వెళ్లి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేయూత బ్లడ్ విభాగం ఛైర్మన్ ఎవి.శ్రీనివాసరావు, జిల్లా చేయూత అధ్యక్షురాలు సురభి శారద, అంగాడ లక్ష్మి, గీసాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదాతను అభినందిస్తున్న అతిథులు

రోడ్డు పక్కనే మురుగు నీటి మరుగు

రోడ్డు వేశారు..డ్రెయిన్‌ను మరిచారు..

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేట లూథరన్ హైస్కూల్ ఎదురుగా ఉన్న వీధిలో సిసి రోడ్డు వేశారు. కానీ డ్రెయిన్‌ను నిర్మించకపోవడంతో మురుగు నీటి మడుగులు ఏర్పడుతున్నాయి. ఈ రహదారిలో శ్రీ ప్రకాష్ ఎనర్జీ స్కూలు, మండల విద్యాశాఖ కార్యాలయం, బోధ నివారణ కేంద్రం, డివిజనల్ పంచాయతీ ఆఫీసు, ఆర్ డబ్ల్యు ఎస్, పంచాయితీ రాజ్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రహదారిలో ఐదేళ్ల క్రితం సిమ్మెంటు రోడ్డు నిర్మించి డ్రెయిన్ నిర్మించడం మానేశారు. దీంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఈ రహదారిలో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తారు. మురుగు నీటి మడుగు మురుగునీటితో నిండిపోతే సిసి రోడ్డుపై నుంచి మురుగునీరు ప్రవహిస్తుంది. ఆ రహదారిలో వెళ్లేవారు మురుగునీటి వాసనతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్‌ను నిర్మించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చదలాడ గ్రామానికి చెందిన ఖండవిల్లి జయబాబు(43) ఆదివారం గ్రామంలోని ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. అతని మృతదేహాన్ని దివిలి వంతెన వద్ద కనుగొని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ చోరీ పై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటి వద్ద పార్కు చేసిన మోటార్ సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు .దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సురేష్ తన మోటార్ సైకిల్ ను రాత్రి ఇంటి బయటపెట్టాడు. మరునాడు ఉదయానికి తన మోటార్సైకిల్ లేకపోవడంతో చోరీ కి గురైందని, మోటార్ సైకిల్ తో పాటు తను రోజూ ఉపయోగించే ట్యాబ్ కూడా బండిలోనే ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం ఉదయం గోపాలపురం శివారు టుబాకో బోర్డు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపల్లి గ్రామానికి చెందిన నలుగురు కూలీలతో ఖాళీ ట్రాక్టర్ వేల్లచింతలగూడెం గ్రామానికి బయలు దేరింది. ఈ క్రమంలో గోపాలపురం పొగాకు బోర్డు సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ చిట్ల వాసు ట్రాక్టర్ వేగాన్ని నియంత్రించలేకపోయాడు. దీంతో అదుపుతప్పి బోల్తా పడింది. కూలీలు కౌజులూరి ఏడుకొండలు, పసివేదల కోటయ్య, పసివేదల గణేష్ , కలిదిండి బుల్లబ్బాయి టక్కు కింద ఉండిపోయారు. కూలీలు మట్టి తొలగించుకుని మార్గం చేసుకుని బయట పడ్డారు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని కూలీలను గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయపడిన కౌజులూరి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ చిట్ల వాసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు.

సారా రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

సారాను రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. బొబ్బిల్లంక గ్రామ శివారు బ్రిడ్జి వద్ద మోటార్ సైకిల్‌పై నాటు సారా రవాణా చేస్తున్న బొబ్బిల్లంక గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీనివాస్, యరసాని వెంకన్నలను అదుపులోకి తీసుకున్నామనానరు. వారి నుంచి 30 లీటర్ల నాటుసారా, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టుకు తరలించగా రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. రఘుదేవపురం చెరువు గట్టు సమీపంలో ఇంటిలోపల పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.16,340 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు

125 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరాంపురం గ్రామంలో మాజీ సర్పంచ్ పైల పైడ్రాజు బంధువులకు చెందిన వేదంతా ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి ప్రారంభించారు. ఈ శిబిరంలో 125 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి. షుగర్. గుండె పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి కృష్ణ, బోడ్డు రమణ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ మునిస్వామి పాల్గొని మాట్లాడారు. అనంతరం బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, స్పోర్ట్స్ డైరెక్టర్ వైద్యనాథన్, ఇన్‌ఛార్జ్ స్వామి, రామకృష్ణ, పిఇటీలు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆదిత్యలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో 11,12 తేదీల్లో జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ మెన్ అండ్ విమెన్ చాంపియన్ షిప్ 2024 పోటీలు జరుగుతాయని ఆదిత్య విద్యాసంస్థలు వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం యూనివర్శిటీకి చెందిన పలువురుతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో జెఎన్‌టియుకె పరిధిలో ఉన్న వివిధ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ ఆదిరెడ్డి, డాక్టర్ రవి పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తితో జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ

ప్రజాశక్తి- అమలాపురం

తమ శాఖ ద్వారా ప్రభుత్వం ఉద్యాన పంటలు, పరిశ్రమలకు పలు ప్రోత్సాకాహాలను అందిస్తున్నామని జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ తెలిపారు. ఉద్యాన రైతులకు అందిస్తున్న రాయితీలను ఉపయోగించుకోవడంతో పాటు అధిక ఆదాయం ఆర్జించే పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఉప ఉత్పత్తులు తయారు చేసుకుంటూ గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఇంకా పలు విషయాలను ఆయన ప్రజాశక్తితో పంచుకున్నారు.

జిల్లాలో ఏ ఉద్యాన పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి?

జిల్లాలో ఎక్కువగా కొబ్బరి, జీడి మామిడి, ఆయిల్ పామ్, మామిడి, అరటి, కర్ర పెండలం, కాయగూరలు, పూలు, పసుపు, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇందులో సుమారు 30 వేల ఎకరాల్లో జీడి మామిడి, 28 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్, 20 వేల ఎకరాల్లో మామిడి, సుమారు 4 వేల ఎకరాల్లో అరటి, మిగిలిన విస్తీర్ణంలో దానిమ్మ, నిమ్మ, నారింజ, జామ, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి.

శీతల గిడ్డంగుల నిర్మాణానికి రాయితీలు ఇస్తున్నారా.?

రైతులకు,రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 30 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల శీతల గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 లక్షల యూనిట్ విలువలో రూ.11.25 లక్షలు వరకూ రాయితీ ఇస్తుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. ఈ యూనిట్లను నెలకొల్పుకునే రైతులు ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ఆహార పదార్థాల శుద్ధీకరణ యూనిట్లకు ఎటువంటి రాయితీలు ఉన్నాయి...

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆహార పదార్థాల శుద్ధీకరణ యూనిట్ల కోసం రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. రూ.30 లక్షల యూనిట్ విలువకు ప్రభుత్వం గరిష్ఠంగా 35 శాతం రాయితీలను ఇస్తుంది. అలాగే యూనిట్ విలువలో 90 శాతం బ్యాంకు రుణాలు కూడా ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం.

సమీకృత ఉద్యాన పంటల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

సమీకృత ఉద్యాన పంటల అభివృద్ధి పథకంలో భాగంగా మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ప్రభుత్వం అందజేస్తుంది. యూనిట్ విలువ రూ.25 లక్షలు ఉంటుంది. జీడి పిక్కల ప్రాసెసింగ్, మామిడి తాండ్ర తయారీ తదితర పరిశ్రమలను ఈ పథకంలో భాగంగా నెలకొల్పుకునే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా మరో 35 శాతం అదనంగా రాయితీ కల్పిస్తాం. జిల్లాలో 10 యూనిట్ల మంజూరుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఎస్‌సి లబ్ధిదారులు కూడా అవకాశం ఉంది.

ఆధునిక సాగు పద్ధతులను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారు.?

ఆధునిక సాగు పద్ధతుల్లో భాగంగా ఉద్యాన శాఖ షెడ్ నెట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. 35 శాతం సబ్సిడీతో పూలు, కూరగాయలు వంటివి సాగు చేసుకోవచ్చు.వీటి ద్వారా అధికాదాయం పొందొచ్చు.

అంతర పంటలపై అవగాహన కల్పిస్తున్నారా..

రైతులు అదనపు ఆదాయం పొందేందుకు అంతర పంటలు ఉపయోగకరంగా ఉంటాయి. కొబ్బరి, ఆయిల్ ఫాం తదితర పంటలలో కురగాయలు, అల్లం, పసుపు, కంద, కోకో, మిరియాలు వంటి పంటలను వేసుకోవచ్చు. వీటిని ఉద్యానశాఖ తరుపున రాయితీలో అందిస్తున్నాం.

ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలా...

రైతుల పంటలకు ఇన్ పుట్ సబ్సిడీ రావాలన్నా, ఇన్సూరెన్స్ పొందాలన్నా, బ్యాంకుల నుంచి రుణాలు కావాలన్నా ఇలా ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. జిల్లాలో 85 శాతం మామిడి, జీడిమామిడి ,కొబ్బరి, ఆయిల్ ఫామ్ తదితర దీర్ఘకాలిక పంటలు,15 శాతం కూరగాయలు, పసుపు, బొప్పాయి, పూలు,పండ్లు తదితర పంటలను రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలి.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

కొబ్బరి ఆధారిత కుటీర పరిశ్రమల నెలకొల్పుకునేందుకు ప్రభుత్వం విరివిగా రాయితీలు ఇస్తుంది. కోకోనట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ద్వారా వ్యక్తులు, రైతులు, సంఘాలకు 35 శాతం రాయితీపై యూనిట్‌లను పెట్టుకునే అవకాశం ఉంది.

అవినీతి రహితంగా సేవలందిస్తా

- కూడా చైర్మన్ తుమ్మల బాబు వెల్లడి

-ఘన స్వాగతం పలికిన జనసైనికులు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో అవినీతి రహితంగా ప్రజలకు సేవలందిస్తానని కుడా చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. కుడా చైర్మన్‌గా నియమితులైన ఆయన మంగళగిరిలో పవన్ కళ్యాణ్‌ను కలుసుకుని తిరిగి ఆయన ఆదివారం పెద్దాపురం నియోజకవర్గానికి ఆదివారం వచ్చారు. సామర్లకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు తుమ్మల బాబుకు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా భీమేశ్వర ఆలయానికి చేరుకున్నారు. భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుడా విధివిధానాలపై రెండు వారాలపాటు సమగ్రంగా అధ్యయనం చేసి అనంతరం బాధ్యతలు చేపడతానని అన్నారు.

పెద్దాపురంలో తుమ్మల బాబుకు ఘనంగా స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

సామర్లకోటలో మీడియాతో మాట్లాడుతున్న కుడా చైర్మన్ తుమ్మల బాబు

కూటమి ప్రభుత్వంలో తనకు నామినేటెడ్ పదవి కల్పించడం పట్ల తమ అధినేత పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు, యువ నాయకుడు లోకేష్‌కు ఆయన కృతజ్ఞతులు తెలిపారు. అవినీతికి తావు లేకుండా కుడా పరిధిలో నిధులను గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు సరోజ వాసు, నాయకులు అత్తిలి కృష్ణ, కూటమి నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత ఆయన పెద్దాపురం పట్టణానికి చేరుకున్నారు. కొత్తపేట గుర్రాల సెంటర్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. దారిపొడువన బాణాసంచా కాలుస్తూ తుమ్మల బాబును గజమాలలతో సత్కరించారు. ఈ ప్రదర్శన కొత్తపేట, దర్గా సెంటర్, వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్, మెయిన్ రోడ్డు, డైలీ మార్కెట్ సెంటర్, ఆంజనేయస్వామి గుడి సెంటర్, మున్సిపల్ సెంటర్ మీదుగా సామర్లకోట వైపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, జనసేన యూత్ ప్రెసిడెంట్ తమనార లక్ష్మణ్ దివాకర్, ఒబిలిశెట్టి గున్ని, కటారి శ్రీను, నామా సతీష్, అల్లం కుమార్‌స్వామి, గొల్లపల్లి భద్ర, ఖండవిల్లి సత్య, కరెడ్ల రాజా, బెందులూరి స్వామి, గుండేపల్లి సుధాకర్, అంబటి రాంబాబు పాల్గొన్నారు.

త్వరలోనే బిసి రక్షణ చట్టం: మంత్రి సుభాష్

ప్రజాశక్తి - తాళ్లరేవు

వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

బిసి కులాలకు రక్షణగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బిసి రక్షణ చట్టం తేను న్నట్లు కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండలంలోని జార్జిపేటలో శ్రీరామ శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకుల కోసం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పథకంలో రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 10 నుంచి 20 ఎకరాల్లో ఇండస్ట్రీ హబ్‌లు ఏర్పాటు చేసి పరిశ్రమలు స్థాపించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంఘం అధ్యక్షులు రాయుడు సూరిబాబు, గెద్దాడ శ్రీనివాస్ బృందం మంత్రి సుభాష్‌ను సత్క రించారు. ఆటలలో గెలుపొందిన చిన్నారులకు మంత్రి సుభాష్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కె.శివన్నారాయణ, జి.సాయి, టి.లక్ష్మణరావు, ఎ.బాబూ రావు, స్థానిక నాయకులు జి.సూర్యనారాయణ, పి.ఏడు కొండలు, కమిటీ ప్రతినిధులు ఆర్.సూరిబాబు, జి.శ్రీనివాస్, డి.నీలాద్రి, సిహెచ్.మహేష్ పాల్గొన్నారు.

నిమ్మలపూడి శ్రీనుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

మండల కేంద్రమైన గండేపల్లి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు నిమ్మలపూడి శ్రీను అన్నయ్య, క్రీస్తుశేషులు బాబ్జి కుమారుడు వివేక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం పట్ల పలువురు పరామర్శించారు, ఆదివారం మాజీ సొసైటీ అధ్యక్షులు, టిడిపి నాయకులు పరిమి బాబు నిమ్మలపూడి శ్రీనును కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు, చిన్న వయసులోనే చార్టెడ్ అకౌంట్డ్ చదివి మంచి ఉన్నత స్థాయికి ఎదగవలసిన సమయంలో అనారోగ్యం వల్ల మృతి చెందడం బాధాకరమని అన్నారు. పరామర్శించిన వారిలో తొండాపు రమణారెడ్డి, సంకవల్లి రమేష్, కంటిపూడి రామారావు, పేరారుపు సత్యనారాయణ, పైపూరి సారంగబాబు ఉన్నారు.

సత్తిబాబుకు మంత్రి సుభాష్ పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

నీలపల్లికి చెందిన టిడిపి నాయకులు సత్తిబాబు ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోవడంతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి బాబి, స్థానిక నాయకులు చిత్తూరు కలికి మూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ముదునూరి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పెద్దిపాలెం గ్రామానికి చెందిన విత్తనాల ప్రసాద్ ఇటీవల బాణాసంచా కాలుస్తూ గాయపడ్డాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని అన్నారు. గ్రామంలో వైసిపి కార్యకర్తలను ఆయన పరిచయం చేసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.

బాధితునికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముదునూరి

జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బెహరా దొరబాబు, సర్పంచ్‌లు ఏపూరి రామారావు, దేవర రమేష్‌యాదవ్, పిల్ల చిన్నా, లొండ బాబు పాల్గొన్నారు.



బాధితునికి నిత్యవసర సరుకులు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

నిత్యావసర సరుకుల అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో జరిగిన విద్యుత్ షాక్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి పురాణపండ సత్యనారాయణమూర్తి హరి కుసుమాంబ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యవసరాలు, 25 కేజీల బియ్యం, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు కూలీ సంఘం ప్రధాన రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లా డుతూ సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ట్రస్ట్‌కి కృతజ్ఞతులు తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు పురాణ పండ శేషసాయిశర్మ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాదిత కుటుంబాన్ని ఆదుకోవడం జరిగిందన్నారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే ట్రస్ట్‌ను సంప్రదిస్తే తాము ఆదుకుంటామని ఆయన తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కమిషనర్ భావన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకూ డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్లో సమస్యలను వివరించవచ్చునని తెలిపారు. అనంతరం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు నేరుగా సమస్యలపై అర్జీలను అందజేయవచ్చునని అన్నారు. నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

శ్రీశైలంలో ఎంఎల్ఎ చినరాజప్ప పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

శ్రీశైలం దేవస్థానంలో మల్లికార్జున స్వామి వారిని ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.కార్తీక మాసం నేపథ్యంలో ఆదివారం శ్రీశైలం చేరుకున్న చినరాజప్ప, ఆయన సతీమణి అనురాధ, తనయుడు రంగనాగ్, ఇతర కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు.

పిఠాపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక సీతయ్య గారితోటలో నూతనంగా నిర్మించిన కార్తికేయ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత వైద్యులు మొగిలి కాశీ విశ్వనాథం మాట్లాడుతూ ఆర్థోపెడికల్, జనరల్ మెడిసిన్, ఇఎన్‌టి, న్యూరాలజీలకు సంబంధించిన డాక్టర్లతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరంలో రూ.2500 విలువ గల ఎముకల సాంద్రత పరీక్షను ఉచితంగా చేసినట్లు తెలిపారు. ఎక్స్‌రే ను సగం ధరకే తీసినట్లు చెప్పారు. ఈ శిబిరంలో వైద్యులు కె.గోవిందబాబు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - కాజులూరు

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆర్యవటం గ్రామంలో 9వ సప్తహ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో గ్రామాలు ప్రశాంతతకు మారుపేరుగా నిలుస్తాయన్నారు. ప్రజలు ఐక్యతగా ఉండి ఆధ్యాత్మిక కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోట తాతబ్బాయి, సలపల ధనరాజు పాల్గొన్నారు.

ఐక్యతకు వన సమారాధనలు దోహదం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, ప్రత్తిపాడు

నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను చాటేందుకు వన సమారాధనలు దోహదం చేస్తాయని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఎంఎల్ఎ పంతం నానాజీ ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కుటుంబాలతో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఏడాదికోసారి నిర్వహించుకునే వన సమారాధనలో కుటుంబ సమేతంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం సంతోషకరమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. ఎంఎల్ఎ పంతం నానాజీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో సతమత మయ్యే నాయకులు, కార్యకర్తలను ఏకం చేసి, వారి మధ్య సమన్వయం నింపేందుకు ప్రతి ఏటా ఈ వన సమారాధన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్ఎలు వర్మ, పిల్లి అనంతలక్ష్మి, స్టేట్ సివిల్ సప్లయి చైర్మన్ తోట సుధీర్, కూటమి గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

వర్తకుల సంక్షేమానికి కృషి చేస్తా

ఎంఎల్ఎను సత్కరిస్తున్న వర్తక సంఘీయులు

నియోజకవర్గంలో వర్తకుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం వర్తకుల సంఘం ఆధ్వర్యంలో వన సమారాధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నన్ను ఎంఎల్ఎగా చూడొద్దని మీ కుటుంబ ఆడ పడుచుగా, బిడ్డగా చూడాలని కోరారు. వర్తకుల కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్తీక మాసంలో కులాలు, మతాలకు అతీతంగా ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని అందరూ సంతోషంగా గడిపేలా కార్యక్రమాన్ని నిర్వహించిన సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎను వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, వర్తక సంఘం సభ్యులు కిలపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

బాల మందిరంలో విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖనం, నాటకీకరణ పోటీలు నిర్వహించారు. ఆదివారం మాధవపట్నం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తొలుత బాలల సభ జరిగింది. ఈ సందర్భంగా కథలు చదవడం, కథలు చెప్పడం, నచ్చిన కథను నాటకీకరణ గావించి ప్రదర్శించడం వంటి కార్యక్రమాలతో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. అలాగే చిత్రలేఖనం, నాటకీకరణ పోటీలు నిర్వహించారు.

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ కాపురస్తులైన నొక్కు లూధి భర్త శ్రీను వయసు.33 సంవత్సరాలు తేదీ.**1.11.2024** న మల్లేపల్లి నుండి జగ్గంపేట మోటార్ సైకిల్ మీద బయలుదేరి వెళ్తున్నప్పుడు మార్గమధ్యలో నా యొక్క పాస్‌పోర్టు నెంబరు.**N1722926** గల పాస్‌పోర్టు పోయినది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

నా అడ్రస్
నొక్కులూది , భర్త. శ్రీను,
మల్లేపల్లి గ్రామం, డోర్ నెంబర్. 2-26.
గండేపల్లి మండలం, కాకినాడ జిల్లా,
పిన్: 533435,ఫోన్ నెంబర్. 7396713335

పాస్ పోర్ట్ పడిపోయినది

డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, ఆదుర్రు గ్రామానికి చెందిన బొంతు కృష్ణ S/o. గంగారామ్‌కు చెందిన పాస్ పోర్ట్ పడిపోయినది. పాస్ పోర్ట్ నెంబర్ P5701690. ది 01-11-2024న తేదీన ఇంటి వద్ద నుంచి మామిడికుదురు సెంటర్‌కు పాస్ పోర్ట్ తీసుకొని మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మార్గం మధ్యలో పడిపోయింది. దొరికిన వారు క్రింది అడ్రస్ కు అందజేయగలరు.

బొంతు కృష్ణ, S/o. గంగారామ్
Do. No. 5-122, ఆదుర్రు,
మామిడికుదురు మండలం

IN THE COURT OF THE 12th ADDL.DIST.JUDGE:PITHAPURAM O.S.NO.5/2023

Between:
Thatavarthy Subrahmanyam and others ...Plaintiffs
And
Chikkam Devika Rani and another ...Defendants

To
[D1] Chikkam Devika Rani, D/o. Subbarao, aged 52 yrs, Advocate, D.No.68-10-14A, Near Ideal College, Vidyuth Nagar, Kakinada

పై నెంబరు కేసులో 1వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక తప్పించుకుని తిరుగుచున్నారు. మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **15-11-2024** ఉదయం **10** గం॥లకు వాయిదా వేసినారు. మీరు హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

A.V.CH.S.S.MURTHY
SRI CH.V.APPARAO
A.SIDHVI RAMANA KASHYAP
Advocates,
Ashok nagar, Kakinada
Cell:9848338335

నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ మరియు సెషన్స్ జడ్జి, కాకినాడ

F.D.P. 20/2020 in O.S.261/1985

కొత్తలంక కామరాజు మరియు ఇతరులు ...పిటీషనర్లు
మరియు
కొత్తలంక విశ్వనాథం మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు 1 టు 36

టు:

19. కొత్తలంక అన్నపూర్ణ, (భర్త) (లేటు) శ్రీ కంఠ శివాచార్యులు, వయస్సు 58, హిందు, డోర్ నెం. 67-25-114/2ఎ, సింహాచల నగరం, విశ్రాంతిపురం, రాజమహేంద్రవరం.

20. కొత్తలంక సతీష్, (తండ్రి) శ్రీకంఠ శివాచార్యులు, వయస్సు 40, హిందు, డోర్ నెం. 67-25-114/2ఎ, సింహాచల నగరం, విశ్రాంతిపురం, రాజమహేంద్రవరం.

21. కొత్తలంక శ్రీనివాస్, (తండ్రి) శ్రీకంఠ శివాచార్యులు, వయస్సు 35, హిందు, డోర్ నెం. 67-25-114/2ఎ, సింహాచల నగరం, విశ్రాంతిపురం, రాజమహేంద్రవరం.

22. కొత్తలంక విశ్వేశ్వర శర్మ, (తండ్రి) (లేటు) సత్యనారాయణ, వయస్సు 45, హిందు, అర్చక, డో.నెం: 4-439/1, ఊబలంక వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

23. కొత్తలంక విశ్వనాథం (చిట్టిబాబు), తండ్రి (లేటు) సత్యనారాయణ, వయస్సు 43, హిందూ అర్చక, డో. నెం. 4-439/1, ఉమామహేశ్వర స్వామి టెంపుల్, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

24. కొత్తలంక వీరభద్రరావు (రాజా), (తండ్రి) సత్యనారాయణ, వయస్సు 41, హిందు, ఎంప్లాయ్, డో.నెం. 4-439/1, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

25. పూజ్యం సత్యకళావతి, భర్త సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, వయస్సు 38, హిందూ గృహిణి, డో.నెం. 4-439/1, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

26. పుల్లేటికుర్తి వీరగవరమ్మ, భర్త నాట్ నౌన్, వయస్సు 35, తండ్రి కొత్తలంక సత్యనారాయణ వయస్సు 35, హిందు, గృహిణి, డో. నెం. 4-439/1, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

27. కొత్తలంక విస్సన్న, తండ్రి (లేటు) రామచంద్రరావు, వయస్సు 60, హిందు, డో.నెం. 2-115/2, శివాలయం వీధి, జెడ్. రాగంపేట పోస్టు, జగ్గంపేట, కాకినాడ జిల్లా.

28. కొత్తలంక సూర్యనారాయణశర్మ, తండ్రి (లేటు) రామచంద్రరావు, వయస్సు 58, హిందూ, డో.నెం.2 - 115/2, శివాలయం వీధి, జె. రాగం పేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

29. పుల్లేటికుర్తి వీరచంద్రలక్ష్మి, భర్త నాట్ నౌన్, కేరాఫ్ కొత్తలంక శేషమ్మ, వయస్సు 56, హిందు, డో.నెం.2-115/2, శివాలయం వీధి, జె. రాగంపేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

30. అయినవిల్లి వీరరాఘవమ్మ, భర్త నరసింహామూర్తి, వయస్సు 54, హిందూ, డో.నెం.2-115/2, శివాలయం వీధి, జె. రాగంపేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

31. వాడ్రేవుల శేషమ్మ, భర్త సుందరరావు, వయస్సు 52, హిందు, డో.నెం.2-115/2, శివాలయం వీధి, జె. రాగంపేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

32. చంద్రమౌళి లలిత భర్త చిట్టిబాబు, కేరాఫ్ బ్రాంచ్ పోస్టుమాస్టర్, వయస్సు 38, హిందు, గృహిణి, కాట్రావులపల్లి, జగ్గంపేట మండలం, కాకినాడ జిల్లా, పెద్దాపురం జేసిజె లిమిట్స్

33. దంతుకుర్తి విజయలక్ష్మి, భర్త సుబ్రహ్మణ్యం, వయస్సు 31, హిందు, గృహిణి, శివాలయం అర్చకులు, పెద్దబ్రహ్మదేవం గ్రామం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా,

34. కొత్తలంక రాజాప్రభావతి భర్త ఉమహేశ్వరరావు, వయస్సు 44, హిందు, గృహిణి, శివాలయం శివారు, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా

35. కొత్తలంక ఫణిపూర్ణ రాజేష్ తండ్రి (లేటు) ఉమా మహేశ్వరరావు, వయస్సు 25, హిందు, అర్చక, శివాలయం శివారు, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

36. యలమంచిలి అన్నపూర్ణ భర్త (లేటు) సత్యనారాయణ, వయస్సు 31, హిందు, అర్చక, శివాలయం శివారు, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావాలోని 9 నుండి 13 రెస్పాండెంట్ల వారసులైన 14 నుండి 36 వరకు జత చేయబడిన వారసులను IA No 830/2022/ Dt. 12-09-2023, వారసులుగా చేర్చుటకు పిటీషనరు వాది దాఖలు చేసిన పిటీషన్, సదరు కేసులో రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేసియున్నారు. కావున **ది. 26-11-2024 తేదీ పగలు 10 గంటల 30 నిమిషాలకు** మీరు గానీ, మీ ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదన చేసుకొనవలెను. లేనియెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

(By Court Order)

అడపా సురేష్
అడ్వకేట్ ఫర్ పిటీషనర్
కాకినాడ. సెల్: 9154874569